## క్లుప్తంగా

### అమ్మవారికి సారె సమర్పణ



మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంలోని శ్రీ అలివేలు మంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలలో భాగంగా గోదాదేవి, లక్ష్మీదేవి అమ్మవార్లకు బుధవారం మహిళలు సారె సమర్పించారు. పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి ప్రీతికరమైన పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, పువ్వులు, పిండివంటలను చేతబూని మేళతాళాలతో రామకృష్ణాపురం పురవీధుల మీదుగా ఊరేగింపుగా వెళ్లి సారె సమర్పించారు. ఆలయంలో ధర్మకర్తలు, ఆలయ అర్చకులు సారె స్వీకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

### ప్రజా కాపునాడు డివిజన్ కార్యవర్గం నియామకం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నగర కార్పొరేషన్ పరిధిలోని 29 వ వార్డు ప్రజా కాపునాడు నూతన కమిటీ నియామకం జరిగింది. గవర్నర్‌పేటలోని ప్రజా కాపునాడు కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు నూతన కమిటీని నియమించారు. డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా కోల రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శిగా కొప్పిశెట్టి దుర్గారావు, ఉపాధ్యక్షులుగా పులప ప్రకాష్, దేవిరెడ్డి ఆదినారాయణ నియమితులయ్యారు. వారికి యర్రంశెట్టి అంజిబాబు నియామక పత్రాలు అందేశారు. కార్పొరేషన్ పరిధిలోని 64 డివిజన్లకు కమిటీలను నియమిస్తున్నట్లు అంజిబాబు తెలిపారు.

### మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



మధురానగర్(విజయవాడసెంట్రల్): వేగంగా అభివృద్ధి చెందుతున్న దావు బుచ్చయ్యకాలనీ, వినాయక నగర్‌లలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్ ఎస్వీ జానారెడ్డి అన్నారు. వినాయక నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు పనులను బుధవారం స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిట్టచివరి గడప వరకు రోడ్లు, మురుగు కాలువ, డ్రైనేజీ, తాగునీటి సరఫరా చేయటానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే కోట్లాది రూపాయల వ్యయంతో పలు రోడ్డు పనులు పూర్తి చేశామని ఇప్పుడు శివారు ప్రాంతాలకు సైతం కనెక్టివిటీ ఇచ్చే విధంగా రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి, వైఎస్సార్‌సీపీ నాయకుడు దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్‌పీఎస్ రద్దు చేసేంతవరకు పోరాడుతాం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వేలో కొత్త పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్‌జేఏసీ, ఎన్‌ఎఫ్‌ఐఆర్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ పిలుపు మేరకు రైల్వే కార్మికులు బుధవారం విజయవాడ డీఆర్‌ఎం కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంప్లాయిస్ సంఘ్ విజయవాడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల రాఘవేంద్రరావు, ఆమంచి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. దక్షిణ మధ్య రైల్వే ఓబీసీ అసోసియేషన్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌లు నేతలు శిబిరంలో పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్లు రమేష్, దేగల శ్రీను, బ్రాంచి కార్యదర్శులు, ఇంజనీరింగ్ బ్రాంచి అధ్యక్షుడు పాల్గొన్నారు.

# జగనన్న రాజ్యంలో ప్రతి కుటుంబానికీ మేలు

**ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



సంక్షేమ పథకాల బోర్డు వద్ద ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ రాజ్యంలో ప్రతి ఒక్క కుటుంబానికీ మంచి జరిగిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నగరంలోని 58వ డివిజన్ 239 వ వార్డు సచివాలయ పరిధిలో బుధవారం జరిగిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. తొలుత పార్టీ జెండాను ఎగురవేసి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ చంద్రబాబు చేతగాని పాలనకు, జగనన్న సమర్థ పాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో అసలైన అర్హులను వదిలేసి లక్షలకు లక్షలు ఆదాయ పన్ను చెల్లించే వారికి, ఖరీదైన కార్లలో తిరిగే వారికి దొడ్డిదారిలో పథకాలు మంజూరు చేసే వారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత శాచ్యురేషన్ పద్ధతిలో పేదలందరికీ ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే వచ్చి అందుతున్నాయని వివరించారు. ప్రతిఏటా సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి మరీ చెప్పిన తేదీకే లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా నగదును జమ చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. 239వ వార్డు సచివాలయ పరిధిలో గత నాలుగున్నరేళ్లలో డీబీటీ ద్వారా రూ.5.40 కోట్లు, నాన్ డీబీటీ ద్వారా రూ.3.37 కోట్లు మొత్తం రూ.8.77 కోట్ల మేలు చేకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బహు భాషా గాయకుడు జేసుదాసు



జేసుదాసు జన్మదిన వేడుకల కార్యక్రమంలో చిట్టిబాబు, చంద్రశేఖర్, కామేశ్వరి తదితరులు

విజయవాడ కల్చరల్: బహుభాషా గాయకుడు డాక్టర్ కేజే జేసుదాసు అని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. చంద్రశేఖర్ కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో బహుభాషా గాయకుడు, సంగీత దర్శకుడు జేసుదాసు 84వ జన్మదిన వేడుకలు బుధవారం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ జేసుదాసు భారతీయ భాషల్లో దాదాపు 50 వేలకు పైగా పాటలు పాడారని గుర్తుచేశారు. చంద్రశేఖర్ కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు దండు చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు జేసుదాసు అని తెలిపారు. సినీ గీతాలతో పాటు ఆయన పాడిన భక్తి గీతాలు తెలుగు వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాయన్నారు. సమావేశంలో సీనియర్ గాయనిలు వద్దాది కామేశ్వరి, బి.కామేశ్వరి, రూపశ్రీ జేసుదాసు గానం చేసిన గీతాలను మధురంగా గానం చేశారు.

### నేడు డయల్ యువర్ డీఎం

ఆటోనగర్(విజయవాడతూర్పు): సుదూర ప్రాంతాలకు ప్రయాణించేవారి సమస్యలను పరిష్కరించేందుకు గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆటోనగర్ డిపో డీఎం కె. ప్రవీణ్‌కుమార్ అన్నారు. బెంగళూరు, మద్రాస్, విశాఖపట్నం, తిరుపతి, కర్నూల్, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రయాణించేవారు ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య సమయంలో 9959225464కు ఫోన్ చేయాలని కోరారు.

### 13న సంక్రాంతి ముగ్గుల పోటీలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గణేశ భక్తబృందం ఆధ్వర్యాన ఈనెల 13వ తేదీ శనివారం స్వర హాస్పిటల్ సహకారంతో సత్యనారాయణపురం బాబూరావు మేడ సెంటర్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు భక్తబృందం సభ్యులు జీఎస్‌ఆర్ దత్తు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు 40 సంవత్సరాలుగా ప్రతితి ఏటా ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు అందజేస్తున్నామన్నారు. పోటీలలో పాల్గొన్న ప్రతి మహిళకు బహుమతి ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు 98855 81579 నంబర్‌లో నమోదు చేయించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

## ఘనంగా ప్రపంచ హిందీ భాషా దినోత్సవం



వల్లభరావును సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): దేశ వ్యాప్తంగా హిందీ భాష వాడుక పెరుగుతోందని రిటైర్డ్ హిందీ అధ్యాపకుడు, డాక్టర్ వెన్నా వల్లభరావు చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో ప్రపంచ హిందీ భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. వల్లభరావు మాట్లాడుతూ విదేశాల్లో 153 విశ్వవిద్యాలయాల్లో హిందీ భాషలో బోధన జరుగుతోందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, కళాశాల డీన్ రాజేష్ సి.జంపాల, కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావుతో పాటుగా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వల్లభరావును కళాశాల ప్రతినిధులు సత్కరించారు.

# అయ్యవారికి దండం పెట్టు...



దావు బుచ్చయ్యకాలనీలో గంగిరెద్దుల విన్యాసాలు



లిటిల్ బ్రెయిన్స్ స్కూల్‌లో...



గౌతమ్ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

**ఆకట్టుకుంటున్న గంగిరెద్దుల విన్యాసాలు**

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పండుగ సమీపించటంతో నగరంలో గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. గంగిరెద్దుల వాళ్లు ఇంటింటికీ వెళ్లి వాయిద్యాలు వాయిస్తూ గంగిరెద్దులతో విన్యాసాలు చేయిస్తున్నారు. హరిదాసులు భక్తి కీర్తనలు ఆలపిస్తూ సత్యనారాయణపురం, మధురానగర్, ముత్యాలంపాడు తదితర ప్రాంతాలలో తిరుగుతున్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా హరిదాసులు, గంగిరెద్దుల విన్యాసాలు నగరవాసులను అలరిస్తున్నాయి.

**పండుగలు సంస్కృతికి ప్రతీకలు**

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మన సంస్కృతీ, సంప్రదాయానికి పండుగలు ప్రతీకలు అని వాటిని గొప్పతనాన్ని పెద్దలు పిల్లలకు తెలియజేయాలని మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ ఫణి ప్రసాద్ ముక్తేవి అన్నారు. సిద్ధార్థ నగర్‌లోని లిటిల్ బ్రెయిన్స్ స్కూల్ ఆవరణలో సంక్రాంతి సంబరాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు బుధవారం పుస్తకాల బ్యాగులను పక్కన పెట్టి గంగిరెద్దుల విన్యాసాలు, భోగి పండ్లు, గొబ్బెమ్మల చుట్టూ నృత్యాలు, భోగి మంటలతో సరదాగా గడిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ సుధా ప్రవీణ పాల్గొన్నారు.

**సంప్రదాయాలను ప్రతిబింబించిన సంక్రాంతి సంబరాలు**

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్‌లోని గౌతమ్ హైస్కూల్‌లో బుధవారం సంక్రాంతి సంబరాలు తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఆద్యంతం కనులపండువగా జరిగాయి. చిన్నారులకు భోగిపండ్లు పోశారు. కోలాటం నృత్యాలు చేస్తూ భోగిమంటలు వేసి గాలిపటాలు ఎగురవేశారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్ నెక్కంటి ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ సంక్రాంతి పండుగ విశిష్టతను తెలియజేశారు.

### ఇద్దరు సస్పెక్ట్ షీటర్ల వీరంగం

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఇద్దరు సస్పెక్ట్ షీటర్లు వీరంగం సృష్టించిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోటకు చెందిన నాగరాజు ఆ ప్రాంతంలో పుల్కా బండి వద్ద పని చేస్తుంటాడు. బుధవారం ఉదయం కరెంట్ ఆఫీస్ వైపు నుంచి ఇంటికి వెళ్తుండగా స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్లుగా ఉన్న పిల్లా సాయి, ఉస్తేల చిన్నబాబు నాగరాజుపై దాడికి పాల్పడి అతని వద్ద నుంచి రూ.8వేలు లాక్కున్నారు. ఆ సమయంలో అక్కడకు వచ్చిన నాగరాజు మేనల్లుడు సాయి తన మామను ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించగా అతనిపై కూడా దాడికి పాల్పడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోవడంతో ఇద్దరు పరారయ్యారు. బాధితులను తీసుకుని చిన్నబాబు ఇంటికి వెళ్లగా అతని తల్లి తిరుపతమ్మ బాధితుడి భార్య రమణ, సాయిపై బ్లేడ్‌తో దాడికి పాల్పడింది. పోలీసులు చిన్నబాబు, తన భార్య రమణను స్టేషన్‌కు తరలించారు. పిల్లా సాయి పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### విద్యుత్ చౌర్యానికి పాల్పడిన 144 మందికి జరిమానా

గుణదల(విజయవాడ తూర్పు): విద్యుత్ శాఖ గుణదల డివిజన్ పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 144 మందికి రూ. 5.20 లక్షల జరిమానా విధించినట్లు ఆ శాఖ ఈఈ జి.కమల కుమారి తెలిపారు. డివిజన్ పరిధిలోని 2,711 గృహాలను, 193 వాణిజ్య సముదాయాలను బుధవారం తనిఖీ చేశామన్నారు. 35 బృందాలుగా ఏర్పడి ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు.

# నగరాభివృద్ధే ధ్యేయం

**స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి**

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరాన్ని ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తున్నామని వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. బుధవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో స్థాయీ సంఘ సమావేశ మేయర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో కంటే మెరుగ్గా విజయవాడను అభివృద్ధి చేస్తున్నామని, నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి చేసేందుకు తాము కృషి చేస్తున్నామని అన్నారు. అజెండాలో మొత్తం 27 అంశాల ప్రతిపాదన రాగా అందులో 20 అంశాలను ఆమోదించగా ఒక అంశాన్ని తిరస్కరిస్తూ తీర్మానం చేశారు. నాలుగు అంశాలను ర్యాటీపై చేయగా ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరో అంశాన్ని ధ్రువీకరించారు.

ప్రధానాంశాలు ఇవి..

- అజిత్‌సింగ్‌నగర్, వాంబే కాలనీలోని డీబ్లాక్ కల్యాణమండపాన్ని లీజుకు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను కమిటీ సభ్యులు రద్దు చేస్తూ తీర్మానం చేశారు.
- సర్కిల్-3 పరిధిలోని కనకదుర్గానగర్ క్రాస్ రోడ్డు అంతర్గత బీటీ రోడ్డు నిర్మాణం కోసం రూ.32లక్షల కార్పొరేషన్ జనరల్‌ఫండ్స్ నుంచి నిధులు మంజూరు చేయాలని వచ్చిన ప్రతిపాదన సభ్యులు ఆమోదించారు.
- సర్కిల్-3 పరిధిలోని సాయిబాబా గుడివద్ద ఉన్న వీఎంసీ కాంప్లెక్స్‌లో 14వ నంబర్ షాపును ఆప్కోకు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.




స్థాయీ సంఘ సమావేశం నిర్వహిస్తున్న వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి

## భక్తులకు దుప్పట్లు పంపిణీ



భక్తులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా–శ్రీనాగమానసాదేవి అమ్మవారి మందిరంలో బుధవారం ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకాలు, హారతులు ఇచ్చారు. మార్గశిర మాసం ముగింపు సందర్భంగా భక్తులకు పెద్దఎత్తున అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. బాబా భక్తులు వెన్నా ఆంజనేయులు–రమాదేవి దంపతులు, కోడేబోయిన శివప్రసాద్ –కవిత దంపతులు 2 వేల మందికి ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాన్ని విష్ణు ప్రారంభించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో శ్రీ సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ (షిర్డీ) ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. భక్తులకు దుప్పట్లు పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు అమ్మవారిని ఆవుపాలు, పంచామృతాలు, చెరుకు రసంతో స్వయంగా అభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి మాట్లాడుతూ మార్గశిర మాసం ముగింపు సందర్భంగా ఈనెల 11న ఐశ్వర్య జ్యోతి వెలిగించే కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జ్యోతులు వెలిగించాలని కోరారు.

## 'అటల్ మారథాన్' నూతన ఆవిష్కరణలకు ఆహ్వానం



విద్యార్థులు తయారు చేసిన పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్

పాయకాపురం(విజయవాడరూరల్): అటల్ టింకరింగ్ ల్యాబ్స్ కలిగిన హైస్కూళ్లతో పాటు అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు అటల్ మారథన్ ప్రోగ్రామ్‌కి నూతన ఆవిష్కరణలకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా కమిషనర్ ఆదేశాలు జారీ చేసినట్టు జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక ప్రతి పాఠశాల నుంచి తప్పనిసరిగా ఒక నామినేషన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా చెప్పారన్నారు. ఈ నెల 26 లోపు ఏటీఎం ల్యాబ్‌లకు సంబంధించిన వెబ్‌సైట్‌లో పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇతర వివరాలకు జిల్లా సైన్స్ అధికారి మైనం హుస్సేన్ ఫోను నెంబరు 98665 28299 సంప్రదించవచ్చన్నారు.

## కృష్ణమాదిగ రాష్ట్రంలో సభ పెడితే అడ్డుకుంటాం

**ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మంద కృష్ణమాదిగ పెద్ద అవకాశవాది అని, ఆయన రాష్ట్రంలో ఎక్కడ సభ పెట్టినా అడ్డుకుని తీరుతామని ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజానికి వర్గీకరణకు మంద కృష్ణమాదిగే అడ్డుపడుతున్నారన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ఏదో ఒక పార్టీకి మద్దతుగా మాట్లాడి లబ్ధి పొందుతున్నారన్నారు. తెలంగాణ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ప్రకటించారని, శీతాకాల సమావేశాల్లో వర్గీకరణ బిల్లుపెడతామని ప్రధాని ప్రకటించకుండానే ఏ విధంగా బీజేపీకి మద్దతు పలికారంటూ ప్రశ్నించారు. మంద కృష్ణ మాదిగ ఇక ఎంతో కాలం మాదిగలను మోసం చేయలేడన్నారు. ఆయన మాటలు నమ్మి మాదిగ జాతి మోసపోయే పరిస్థితిలో లేదన్నారు. ఆంధ్రలో ఎన్నికలు సమీపిస్తున్నాయని, ఈ తరుణంలో ఆయన ఇక్కడ సభ నిర్వహిస్తే అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.

### అంబేడ్కర్ స్మృతివనంకు సంఘీభావంగా

## సంతకాల సేకరణ ప్రారంభం

పాయకాపురం(విజయవాడరూరల్): ఎల్‌బీఎస్ నగర్లోని 271వ సచివాలయం వద్ద బుధవారం కార్పొరేటర్ ఆలంపూరు విజయలక్ష్మి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సమతా సంకల్ప స్థాపన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్మృతి వనం ఈ నెల 19న ప్రారంభోత్సవం చేస్తున్నారని చెప్పారు. అనంతరం ప్రజాభిప్రాయ సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అలంపూరు విజయ్‌కుమార్, రామిరెడ్డి, బోరా బుజ్జి, హైమావతి, సుభాన్, రాధ, సాంబయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. 61వ డివిజన్ 262వ సచివాలయంలో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవం ఈ నెల 19న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరుగుతుందన్నారు. అనంతరం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావు, కన్వీనర్లు వి.వి.వెంకటేశ్వరావు, చీకటి నాగమణి, నాగిరెడ్డి, నబీ, దుర్గాప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.







## పల్లెకు పోదాం చలో..





సంప్రదాయాల సమ్మేళనం సంక్రాంతి వచ్చేస్తోంది. వస్తూ వస్తూ పట్టణాలను పల్లెల వెంట రమ్మని పిలుస్తోంది. ఉపాధి కోసం రెక్కలు కట్టుకుని వలస పోయిన పక్షులు, చదువులంటూ సిటీ బాట పట్టిన విద్యా కుసుమాలను సొంత గూటికి ఆహ్వానిస్తోంది. పల్లె దారుల్లో ఆత్మీయ పలకరింపులు ఉంటాయని గుర్తు చేస్తూ.. అమ్మ చేతి పిండి వంటల వైపు మనసును మళ్లిస్తోంది. దీంతో విజయవాడలోని పీఎన్ బస్టాండ్, రైల్వే స్టేషన్ కిక్కిరిసిపోయాయి. ఏ బస్సు చూసినా, ఏ రైలు చూసినా ఇసుకేస్తే రాలనంతగా ప్రయాణికులతో నిండిపోయాయి. బుధవారం పీఎన్‌బీఎస్, రైల్వే స్టేషన్లలో రద్దీని చిత్రాల్లో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

▪ **దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే కొడాలి నాని దంపతులు**

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని దంపతులు బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. ఆలయ ఈఈ కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందించారు.